క్లుప్తంగా

చందనాఖాన్ మృతి కళారంగానికి తీరనిలోటు

వైవీయూ : కడప కలెక్టర్‌గా సేవలందించిన చందనా ఖాన్ మృతి కళా రంగానికి తీరని లోటు అని వైవీయూ లలిత కళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు పేర్కొన్నారు. వైవీయూ లలిత కళా విభాగంలో చందనాఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృత్యుంజయరావు మాట్లాడుతూ స్వతహాగా చిత్రకారిణి కావడంతో చందనాఖాన్ వైవీయూ లలిత కళా విభాగాన్ని ప్రోత్సహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.వెంకటేష్ , చినరాయుడు, బి.ఈరప్ప, చంటి, సూరి, ఎం.వాసవి, రెడ్డి శేఖర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

నియామకాలు చేపట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్సార్టీసీలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని బాధిత అభ్యర్థులు సాయి, ప్రకాశ్, రమ్యతేజ, అవినాష్ కోరారు. కలెక్టర్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020 వరకు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలిచ్చారని, 2020 తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగినా, ఇంతవరకూ నియామకపత్రాలు జారీ చేయలేదన్నారు. ఈ విషయంగా తమకు తగిన న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

రక్తదానంపై రేడియో ప్రసంగం

కడప కల్చరల్ : ఈ నెల 10న స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ జి.శివశంకర్‌రెడ్డి రేడియో ప్రసంగం చేశారు. ఆకాశవాణి కడప కేంద్రంనుంచి ఆయన ప్రసంగం మంగళవారం ఉదయం 7.15 గంటలకు ప్రసారం కానుంది.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పోలిమేర గోపాల్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయం ఎదుట పరిసరాలను సోమవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత నెల 17వ తేదీ నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని అన్ని డిపోల్లో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఆర్టీసీ సిబ్బంది గడ్డి, పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో పి.లక్ష్మీభాస్కర్, ధనలక్ష్మి, డిల్లీశ్వరరావు, సీఐ శ్రీలత, జనార్దన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి సన్మానం

కడప రూరల్ : సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య ఇటీవల పదవీ విరమణ పొందడంతో పలువురు సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. స్థానిక గిరిజన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఎస్టీ హాస్టళ్ల అభివృద్ధికి వెంకటసుబ్బయ్య ఎంతగానో కృషి చేశారన్నారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గిరిజన విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కులగణనతోనే న్యాయం

కడప రూరల్ : ఎస్సీ కుల గణన చేపడితేనే సామాజిక న్యాయం చేకూరుతుందని ఏపీ ఎమ్మార్పీఎస్ నేతలు ఆంజనేయులు, కృష్ణమూర్తి, శివారం అన్నారు. ఎస్సీ కుల గణన చేపట్టాలని కోరుతూ స్థానిక బాబు జగ్జీవన్ రాం విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సచివాలయాల్లో కుల గణాంకాల నమోదు కేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామాంజి, నాగభూషణం, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై స్టంట్ చేస్తే చర్యలు

– ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఎస్.రమాకాంత్

కడప అర్బన్ : మోటార్ సైకిళ్లపై స్టంట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని కడప ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఎస్.రమాకాంత్ హెచ్చరించారు. సోమవారం మోటార్ సైకిళ్లపై విన్యాసాలు చేస్తున్న యువకులు, వారి తల్లిదండ్రులకు స్థానిక రిమ్స్ పోలీస్ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనర్లకు తల్లిదండ్రులు బైక్‌లు ఇవ్వడం మంచి పద్ధతికాదని, పట్టుబడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సీతారామిరెడ్డి, ఎస్‌ఐ యు.వై.జయరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపట్ల అసభ్య ప్రవర్తన

కడప అర్బన్ : నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయదుర్గాకాలనీ ఎదురుగా వున్న ఓ సూపర్ మార్కెట్‌లోకి ఈ నెల 29న రాత్రి ఓ మహిళ పరోటా ప్యాకెట్ కోసం వెళ్లింది. అదే సమయంలో సుమంత్ అనే వ్యక్తి వచ్చి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యార్థుల ఎంపిక

కడప ఎడ్యుకేషన్/చింతకొమ్మదిన్నె : కడప అంగడివీధి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్–14 వాలీబాల్ పోటీల్లో మరియం, దివ్య తేజస్విని, సమియాతంజిల్, అండర్–17 వాలీబాల్ పోటీల్లో అక్షయ మానస, నిహారిక, ఖోఖోలో యువరాజు, సమియతంజిల్, అండర్ –17 ఖోఖోలో సమద్ అలీఖాన్, అండర్ –17 వాలీబాల్‌లో నందకిషోర్, కబడ్డీలో మరియం, ఖోఖో సమియ తంజిల్ ఎంపికైనట్లు హెచ్‌ఎం వేంకటేశ్వరరెడ్డి తెలిపారు.

జగజ్జనని పూజకు వేళాయె



అమ్మవారిశాల వద్ద భారీ వేదిక



విద్యుద్దీపాల వెలుగులో విజయదుర్గాదేవి ఆలయం



ఆకట్టుకునేలా పందిరి ఏర్పాటు

- నవరాత్రులకు అందమైన వేదికలు సిద్ధం
- దర్శనాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కడప కల్చరల్ : భక్తుల కొంగు బంగారం జగజ్జననిని నవరాత్రులు ఆరాధించేందుకు రంగం సిద్ధమైంది. ఆలయాల్లో రంగు రంగుల పందిళ్లు, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో ఆలయాలకు దసరా శోభ సంతరించుకుంది. కడప నగరంలో పది రోజులపాటు అమ్మవారిని కొలువుంచి నిరంతరాయంగా ఉత్సవాలు నిర్వహించేందుకు అందమైన వేదికలు సిద్ధమయ్యాయి. గురువారం ఉదయం నుంచి వేద పండితులు శాస్త్రోక్తంగా శరన్నవరాత్రుల వేడుకను ప్రారంభించనున్నారు. నగరంలో మొత్తం 17 అమ్మవారి ఆలయాలున్నాయి. ప్రధానంగా అమ్మవారిశాల, విజయదుర్గాదేవి ఆలయాల్లో వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. ఇవి కాకుండా మిగిలిన ఆలయాల్లోనూ భారీ పందిళ్లు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. గడ్డిబజారు ఆలయం వెలుపల అందమైన రాజభవనాన్ని తలపించేలా భారీ వేదిక తీర్చిదిద్దారు. దీంతోపాటు దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎన్జీఓ కాలనీలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి, వైష్ణవాలయాల్లోనూ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ



పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.అంకాల నాగరాజు, పి.శివరామకృష్ణ, లీలావర్ధిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైవీయూ గురుకులంలో..

యోగి వేమన విశ్వవిద్యాలయంలోని గురుకులం విభాగం పరిసరాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్ డా.గంగయ్య ఆధ్వర్యంలో వాలంటీర్లు పిచ్చిమొక్కలు తొలగించారు. సహ ఆచార్యులు డా.సరిత, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు క్విజ్ పోటీలు

కడప ఎడ్యుకేషన్ : వరల్డ్ స్పేస్ వీక్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు శ్రీహరికోట ఇస్రో ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. అక్టోబరు ఒకటో తేదీన కడప నగర పాలక ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గంగిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే పోటీల్లో ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

– జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : పోలీసు శాఖకు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు దారుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల సూచించారు. డీఎస్పీ ఎస్.రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని నగర పాలక ఉర్దూ బాలురోన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రధానోపాధ్యాయురాలు ఒ.మరియరాణి, నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.సాజిత్ సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారితో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అండర్–14, అండర్–17 కడప నియోజకవర్గ బాల బాలికల జట్లను ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు ప్రవీణ్‌కిరణ్, వెంకటలక్ష్మి, గణేష్, సీఆర్‌పీ శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం తిరిగి ప్రవేశపెట్టాలి



ధర్నాలో మాట్లాడుతున్న జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం నేతన్న నేస్తం పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 2.70 లక్షల మంది చేనేత కార్మికులకు, ఉప కార్మికులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. రాష్ట్రంలో 25 శాతం మంది చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలను ప్రజలకు అందించాలన్నారు. కానీ చేనేత కార్మికులకు ప్రభుత్వాలు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో కూడా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జీవీ రమణ, సంగటి మనోహర్, వైఎం ప్రతాప్‌రెడ్డి, కైపు రామాంజనేయులు, పెద్దుళ్లపల్లె మల్లికార్జున, పీవీ రమణ, బీసీ గంగులు పాల్గొన్నారు.

ఏడీఏను నియమించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప డివిజన్ వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్‌ను తక్షణమే నియమించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ కడప డివిజన్‌లో ఆరు మండలాలున్నాయని, పర్యవేక్షించాల్సిన ఏడీ ఆరు నెలల కిందట ఉద్యోగ విరమణ చేసినా కొత్త అధికారిని నియమించలేదన్నారు. ఏడీ లేకపోవడంతో డీలర్లు ఎరువులు, మందులు, విత్తనాల ధరలు ఇష్టారాజ్యంగా పెంచి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

కష్టపడి కాకుండా.. ఇష్టంతో చదవాలి

జేసీ అదితిసింగ్



బధిర యువకులకు డైసీ ప్లేయర్లు అందజేస్తున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : కష్టపడి కాకుండా.. ఇష్టంతో విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు నాలుగు ల్యాప్‌టాప్‌లు, 12 టచ్ ఫోన్లు, పది డైసీ ప్లేయర్లు సోమవారం ఆమె పంపిణీ చేశారు. జేసీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు చక్కని ప్రణాళిక రూపొందించుకుని కష్టపడితే తగిన ఫలితం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్వీ.కృష్ణ కిశోర్, పీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అకడమిక్ క్యాలండర్

– ప్రిన్సిపల్ వి.సలీంబాషా

వైవీయూ : విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా అకడమిక్ క్యాలండర్‌ను రూపొందించాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా అన్నారు. కళాశాలలో సోమవారం జరిగిన అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బీఓఎస్ మీటింగ్స్, ఫైనాన్స్ అకడమిక్ మీటింగ్స్, ఎగ్జామినేషన్ సెల్ మీటింగ్, పరీక్షల పాటర్న్, బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్, పేపర్ సెట్టింగ్స్ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డా.ఎం.వి.శంకర్, డా.ఎం.అనిత, వై.సుబ్బరాయుడు, డాక్టర్ కె.శశికళ, గురుశంకర్, ప్రసాద్, డా. కె. నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

టెక్నాలజీ సెంటర్ తరలింపు జీఓ రద్దుకు డిమాండ్



డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కొప్పర్తి నుంచి ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలిస్తూ చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీఓ 56ను తక్షణమే రద్దుచేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో డీఆర్వో గంగాధర్‌గౌడ్‌ను సోమవారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో శిక్షణా నైపుణ్యం, మార్కెటింగ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం టెక్నాలజీ సెంటర్ మంజూరు చేసిందన్నారు. ఇది ఈ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతోపాటు నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరించాలని, రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలని ఓవైపు ప్రజలు కోరుతుంటే, చంద్రబాబు బెంచ్ ఏర్పాటు చేస్తామనడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు పాల్గొన్నారు.

బహుముఖ సాహితీవేత్త జనార్దన శాస్త్రి

కడప కల్చరల్ : జోస్యం జనార్దనశాస్త్రి బహుముఖ సాహితీ వేత్తగా పేరు గాంచారని విశ్రాంత తెలుగు పండితులు కందిమల్ల రాజారెడ్డి అన్నారు. కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన నెలనెలా సీమ సాహిత్యం సదస్సులో ఆయన మాట్లాడుతూ సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ 20కి పైగా రచనలు చేసి గుర్తింపు దక్కని గొప్ప అవధాని జనార్దన శాస్త్రిపై ఈ నెల ప్రసంగ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ఎన్.రమేశ్‌రావు, ఆర్.వెంకట రమణ, యం.మౌనిక, కందిమళ్ల పవన్ పాల్గొన్నారు.

ఈహెచ్ఎస్ ద్వారా ఉద్యోగులకు మెరుగైన సేవలు

ఆరోగ్య శాఖ మంత్రికి ఎస్టీయూ వినతి



వైద్య శాఖ మంత్రికి సమస్యను వివరిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఈహెచ్ఎస్ ద్వారా రెఫరల్ ఆసుపత్రులలో వైద్యం సక్రమంగా అందడంలేదని ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ క్యాస్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు ఆస్పత్రి యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయన్నారు. ఉద్యోగులకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులోని కార్పొరేట్ ఆసుపత్రులతోపాటు వేలూరు సీఎంసీ హాస్పిటల్‌లోనూ ఈహెచ్ఎస్ అమలుచేస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా బోధనాసుపత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 2016 బ్యాచ్‌కు చెందిన స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు వినతి పత్రం సమర్పించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

నగరపాలక కమిషనర్ వైఓ నందన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

కడప కార్పొరేషన్ : వినతులు స్వీకరించి సమస్యను పరిష్కరించడంలో జాప్యం చేయవద్దని నగరపాలక కమిషనర్ వైఓ.నందన్ సూచించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో ఏర్పాటుచేసిన ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో ప్రజల నుంచి సోమవారం ఆయన వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూకు 15, టౌన్ ప్లానింగ్‌కు 8, హెల్త్ విభాగానికి రెండు చొప్పున వినతిపత్రాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటలకు రాజీవ్ పార్కులో నిర్వహించే ప్లాస్టిక్ వ్యర్థాల స్వీకరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.చంద్రశేఖర్, ఈఈలు నారాయణస్వామి, ధనలక్ష్మి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లపై ఫిర్యాదు

కడప నగరంలోని దేవుని కడప–నానాపల్లె రహదారిలోని 511, 512 సర్వే నెంబర్లలో అక్రమ లే అవుట్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీయూసీ నాయకుడు వై.సుదర్శన్ డిమాండ్ చేశారు. ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో కమిషనర్ వైఓ నందన్‌ను సోమవారం కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. సుదర్శన్ మాట్లాడుతూ కాలువ పూడ్చి లే అవుట్ ఏర్పాటు చేశారని, జీఎల్‌టీ, ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా ప్రభుత్వ ఆదాయనికి గండి కొట్టారని తెలిపారు. అమాయకులు స్థలాలు కొని మోసపోకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేయాలని కోరారు.

అందుబాటులో రోబోటిక్ కీళ్ల మార్పిడి చికిత్స విధానం



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, ఇతర వైద్యులు

కడప రూరల్ : కడప నగరంలోనే ఆధునిక రోబోటిక్ కీళ్ల మార్పిడి చికిత్స విధానం అందుబాటులో ఉందని ప్రముఖ ఆర్థో నిపుణులు డాక్టర్ సి.విద్యాసాగర్ రెడ్డి అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో జరిగిన ప్రముఖ వైద్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో అత్యాధునిక చికిత్స విధానం తమ వద్ద అందుబాటులో ఉందన్నారు. మెట్రోపాలిటన్ నగరాలకు దీటుగా సుశిక్షితులైన వైద్యులు వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనతి కాలంలో 300కు పైగా సర్జరీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బాలిరెడ్డి, సూర్యారెడ్డి, పల్లా భాస్కర్, నాగేంద్రప్రసాద్, అనిల్‌కుమార్‌రెడ్డి, జయసోమేశ్వరరెడ్డి, మురళి పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేయాలి

మంత్రికి విద్యార్థి సంఘం నాయకుల వినతి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర విభజన చట్ట ప్రకారం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని విద్యార్థి సంఘం నాయకులు రవిశంకర్‌రెడ్డి, జయవర్ధన్, సుబ్బారాయుడు, శంకర్ డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌కు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జరిగితే వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. మూడు సార్లు శంకుస్థాపన చేశారేగానీ, పనులు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించలేమని ప్రభుత్వం లేఖ రాయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాష అమలులో ఎల్ఐసీ అగ్రగామి



బహుమతిని అందజేస్తున్న ఎల్ఐసీ అధికారులు

కడప కల్చరల్ : హిందీ భాష అమలులో జీవిత బీమా సంస్థ అగ్రగామిగా నిలుస్తోందని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ.రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన హిందీ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ జాతీయ సమైక్యతను కాపాడడంలో హిందీ పోషించిన పాత్ర గణనీయమైనదని అన్నారు. అనంతరం సంస్థ నిర్వహించిన హిందీ అనువాదం, ధారణ, పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ భాషను తెలుగులోకి అనువాదం చేయడంలో వై.శ్రీవాణి, ఆంగ్ల భాషా పదాలను హిందీలోకి అనువాదం, మెమరీ టెస్ట్‌లో జి.లీలాలక్ష్మీ, పాటల పోటీలో ఎంసీ.సుబ్బరాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీధర్, శ్యామ్ సుందర్‌రావు, సత్య శ్రీనివాస్, రమేష్‌బాబు, హరేంద్ర, బాబు, జె.రఘు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. విధానాల్లో మార్పులేదు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న పాలెం మహేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. విధానాల్లో మార్పులేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. కడప యూటీఎఫ్ భవనంలో జరిగిన ప్రాంతీయ మహా సభలో వారు మాట్లాడుతూ ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన సంబరాలు నిర్వహించుకుంటుందే గానీ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. 117 జీవో రద్దు చేయడం , పాత పింఛన్ విధానం పునరుద్ధరిస్తామని చెప్పి మాట నిలుపుకోలేదన్నారు. బోధనేతర కార్యక్రమాలలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేసే విధానాలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారి బదిలీలకు తెరలేపడం తగదని అన్నారు. డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్‌అహ్మద్, శ్రీనివాసులు, రూతు ఆరోగ్యమేరీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యాశాఖకు అప్పగించాలి



కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప కార్పొరేషన్ స్వాధీనంలో ఉన్న సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యా శాఖకు అప్పగించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్, ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని పరిపాలనాధికారి విజయ్‌కుమార్‌ను వారు సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప–చెన్నూరు బస్టాండ్ వద్ద విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యావనరుల కేంద్రం, సైన్స్ మ్యూజియం నిర్మించి వాడుకునేవారన్నారు. గత కొంతకాలంగా నిధుల కొరతతో సైన్స్ ప్రదర్శనలు నిలిచిపోయాయని తెలిపారు. ఈ భవనాలను కార్పొరేషన్ అధికారులు ఆధార్ సెంటర్‌కు వినియోగిస్తున్నారన్నారు. సైన్స్ ప్రదర్శనలను తిరిగి ప్రారంభించేందుకు సమగ్ర శిక్ష పథకం నుండి రూ.12 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎమ్‌డీ.ఇలియాస్ బాషా, ఏపీటీఎఫ్(257) జిల్లా అధ్యక్షుడు టి.ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్షుడు ఆర్.అబ్దుల్లా, యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటసుబ్బారెడ్డి, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఆర్.హరికొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లకు రాజకీయ వేధింపులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో అంగన్వాడీ వర్కర్లపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఎవరి పట్ల కక్ష సాధింపుతో వ్యవహరించరాదని సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినప్పటికీ.. అంగన్వాడీ, స్కీమ్ వర్కర్లపై రోజురోజుకూ వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేయడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని భయబ్రాంతులకు గురి చేయడం జరుగుతోందన్నారు. కలెక్టర్, ఐసీడీఎస్ అధికారులు జోక్యం చేసుకుని అంగన్వాడీలకు రక్షణ కల్పించాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లకు రూ.24,500, కోవిడ్ వర్కర్లు, కొత్త కార్మికులకు రూ. 18,500, ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు రూ. 21,000 చొప్పున కనీస వేతనాన్ని ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, ఆర్.లక్ష్మి, లక్ష్మీదేవి, పి.వెంకట సుబ్బయ్య, పి.చంద్రారెడ్డి, ఎన్.భైరవప్రసాద్ పాల్గొన్నారు.